ప్రజాశక్తి
ఆదివారం 22 డిసెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



మునిగిన కల్వర్టు

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని చిడిపుట్టు కల్వర్టు నదిని తలపిస్తోంది. కల్వర్టు మీద నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది.శనివారం వారపు సంతకు వచ్చే గిరిజనుల రాకపోకలు నిలిచి పోయాయి. సన్యాసమ్మ బ్రిజి వద్ద నుండి తిరిగి రావడం జరిగింది. హుకుంపేట ఊరులోనే జాతీయ రహదారి నూతన బ్రిడ్జి నిర్మాణంతో నీరు నిండి చిడి పుట్టు కల్వర్టు వద్దకు చేరింది. అటు పాడేరు మండలం మొదపుట్టు, హుకుంపేట మండలం అడ్డుమండ, జి కె మండ, భారమాసి. తదితర పంచాయతీ ప్రజలు ఇబ్బంది పడ్డారు.


నీటిలో వెళుతున్న వాహనదారులు

ప్రతి గ్రామానికి రోడ్డు

-ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్- అల్లూరి జిల్లాలో 19 రోడ్ల పనులకు శంకుస్థాపన


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి -అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో డోలి మోతలు లేకుండా ప్రతి మారుమూల గ్రామానికి రోడ్డు నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి పంచాయతీ రాజ్, గ్రామీనాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, పర్యావరణ, అటవీ శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వెల్లడించారు. శనివారం అనంతగిరి మండలం పినకోట గ్రామ పంచాయతీ బల్లగరువు గ్రామంలో పర్యటించి 19 రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సభలో ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వాల పాలనలో ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. 19 రోడ్డు పనులు పూర్తి అయితే 4,500 మంది జనాభా ప్రయోజనం పొందుతారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులలో మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ఈ ప్రాంత


బురదలో గిరిజన గ్రామానికి నడిచి వెళ్తున్న పవన్

అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. గంజాయిని పూర్తిగా అరికట్టాలన్నారు. గంజాయితో యువతలో నేత ప్రవృత్తి పెరుగుతుందని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా బల్లగరువు నుండి సుమారు మూడు కిల్లో మీటర్లు నడిచి వజంగి చేరారు. అక్కడ గిరిజనులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ, సరైన రోడ్డు సౌకర్యం లేక రోగులను ఆసుపత్రికి తరలించాలంటే డోలిలో తీసుకెళుతున్నామన్నారు. ఆలస్యం కావడంతో ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందుతున్నారన్నారు.

దీనికి ముందు వాజంగి, దాయర్తి, మద్రెబు తదితర గ్రామ గిరిజనులు పవన్ కళ్యాణ్ తమ గ్రామలకు రావల్చిందేననీ వాజంగి గ్రామంలో నడి రోడ్డు బైటాంచాయి. అనంతరం పవన్ కళ్యాణ్ అక్కడకు చేరి సమస్యలు పరిష్కరానికై వచ్చానని చెప్పారు. అక్కడ నుండి తనతోనే కలిసి సభా ప్రగణంకు వచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బార్ధార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె .అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, మాడుగుల శాసనసభ్యులు బండారు. సత్యనారాయణమూర్తి, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల. రమేష్ బాబు, ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు. విజయ్ కుమార్, ఆర్టీసీ డైరెక్టర్ సివేరి గంగుదొర, స్థానిక. జెడ్పీటీసీ. దీసరి. గంగరాజు, సర్పంచ్. ఎస్.గణేష్ ఎంపిడిఓ. ఎవివి.కుమార్ పాల్గొన్నారు.

పవన్‌కు జెడ్‌పిటిసి గంగరాజు వినతి

ప్రజాశక్తి -అనంతగిరి:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వివిధ వినతులను స్వీకరించారు. శనివారం మండలంలోని విన్నకోట పంచాయతీ పరిధి బల్లగరు గ్రామంలో ఏర్పాటు చేసిన డోలిమోత రహిత ఆంధ్ర ప్రదేశ్ సభకు హాజరైన ఉప ముఖ్యమంత్రికి స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, స్థానిక సర్పంచ్ ఎస్.గణేష్‌లతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గిరిజనులు సమస్యలతో కూడిన వినతి పత్రాలను లిఖితపూర్వకంగా అందజేశారు.అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం నుండి అల్లూరి జిల్లా అనంతగిరి మండలం జీనబాడు మీదుగా సుమారు 30 కిలో మీటర్ల వల్లగర్ వరకు పోలీసు బలగాలు ఏర్పాటు చేశారు.


పవన్‌కు వినతిపత్రం ఇస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

అపరాల పంటలకు అపార నష్టం


బంధ వీధిలో తడిసిన మినప చేను చూపిస్తున్న గిరిజన రైతు

ప్రజాశక్తి -సీలేరు: అల్పపీడన ప్రభావంతో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీలో జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బంధవీధిలో మినుములు, సామలు, రాజ్మా, రాగులు ఇతర అపరాల పంటలకు అపార నష్టం వాటిల్లిందని రైతు సన్యాసిరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది బందవీధిలో అపరాల సాగు అధికంగా ఉందని, పంటలు చేతికి వచ్చే సమయానికి ముసురు పట్టి వీడకుండా వర్షాలు కురవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిలిందన్నారు. వారం రోజులు ముందు సామలు, మినుములు కోసి పంట పొలాల్లో ఆరబెట్టామని, వాటిని భద్రపరిచే సమయానికి వర్షం కొంపముంచిందని ఆవేదన వ్యక్తం చేశాడు. చోడి పైరు వర్షానికి పూర్తిగా తడిసి మొలకలు వచ్చే పరిస్థితి నెలకొందన్నారు.కొంతమంది రైతులు వరి చేను కోసి కల్లాల్లో కుప్పలుగా పెట్టి భద్రపరుచుకోగా, ఆలస్యంగా వరికోతలు చేపట్టిన పొలాల్లో వరి పనలు తడిసిపోయి, వెన్నులు విరిగి పొలాల్లోనే పడిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. వ్యవసాయశాఖ. అధికారులు పంటపొలాలను పరిశీలించి, నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకున్నారు.

పంప్డ స్టోరేజీ ప్రాజెక్టు పనుల్లో కదలిక


ప్రాజెక్టు సైట్‌లో ప్రొక్లెయినర్‌తో చదును చేయిస్తున్న మెగా కాంట్రాక్టర్ ప్రతినిధులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో మంజూరైన 1350 మెగావాట్లు సామర్థ్యం గల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. టెండర్లు పొందిన మెగా కంపెనీ ఇంజనీర్లు, సిబ్బంది కార్యాలయ నిర్మాణం కోసం టిఆర్‌సి క్యాంపులో పనులు ప్రారంభించారు. పంప్డ స్టోరేజీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు ఈ ప్రాంతీయులు భావిస్తున్నారు. పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణ టెండర్లను గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే మెగా కంపెనీ దక్కించుకుంది. అయితే ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులు జాప్యం కావడంతో అప్పట్లో పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అటవీ,పర్యావరణ అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో గత నెలలో అడిషనల్ పిసిసిఎఫ్ రాహుల్ పాండే కేంద్ర పర్యావరణ కమిటీ సభ్యులు బాలాజీ ప్రాజెక్టుపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి పరిశీలించిన సంగతి తెలిసిందే. ప్రాజెక్టు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో మెగా కంపెనీ ప్రాజెక్ట్ నిర్మాణం కావాల్సిన యంత్ర సామాగ్రికి భద్రపరచడానికి స్థలం, కార్యాలయాలు సిబ్బందికి రూముల నిర్మాణానికి స్థానిక ఎపి గురుకుల సమీపంలో జెసిబిలతో స్థలాన్ని సదులు చేసి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మెగాకంపెనీకి సంబంధించిన యంత్రాలు సామగ్రి సీలేరు తీసుకురావడంతో పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి కదలిక వచ్చిందని ఈ ప్రాంతీయ భావిస్తున్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం నేతల నిరసన

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు :అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు, లక్ష్మీపురం గ్రామపంచాయతీ సర్పంచి కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ,. భారత రాజ్యాంగ బద్ధంగా మూడు పర్యాయాలు ఎన్నికైన అమిత్ షా పార్లమెంట్లో భారత రాజ్యాంగ నిర్మాతను కించపరుస్తూ మాట్లాడటం సరికాదన్నారు.ఆర్ఎస్ఎస్ ను బలపరచడానికే వేసే ఎత్తుగడలను మానుకోవాలన్నారు. బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాద సిద్ధాంత పాలన విధానాలను తరిమికొట్టేందుకు భారతదేశ ప్రజలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ పాలనను పాలదోలేందుకు వామపక్షాలతో పాటు, ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ ఏకం కావాలన్నారు. అమిత్ షా కేంద్ర హెూం మంత్రిగా కొనసాగే అర్హత లేదని, తక్షణమే రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎం.నర్సింగ్ పడాల్, ఎస్.గాసిరామ్ దొర, పార్టీ మాజీ కార్యదర్శి పిభీమరాజు, ఆదివాసీ మహిళ సంఘం(ఐద్వా) అధ్యక్షురాలు ఎస్.ఈశ్వరి, కె.శంకర్రావు, కె.దొంబ్రు, రాముర్తి పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు


ఆవేదన వ్యక్తం చేస్తున్న పంప్ ఆపరేటర్

వేతనాలు చెల్లించరూ...

-పంప్ ఆపరేటర్ వేడుకోలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలోని సుజన కోట గ్రామంలో 2021-22లో జల్ వన్ మిషన్ పథకంలో ఇంటింటికి కుళాయిలు వేసి గ్రామంలో ఉచిత నీటి సరఫరా అందించేందుకు ప్రభుత్వ అధికారులు పంపు ఆపరేటర్ ఏర్పాటు చేశారు. తాగునీటి సరఫరా పనులు నిర్వహించేందుకు అదే గ్రామానికి చెందిన సమరెడ్డి చిట్టిబాబుకు నెలకు 2000 చొప్పున వేతనాలు చెల్లిస్తామని అప్పటి పంచాయతీ కార్యదర్శి నియమించి వేతనాలను చెల్లించేవారు..ప్రస్తుత నేటికీ 12 నెలలు కావస్తున్నా బకాయిపడ్డ వేతనాలు చెల్లించలేదని శనివారం పాత్రికేయులకు పంప్ ఆపరేటర్ తన ఆవేదనను వెలిబుచ్చాడు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంచినీటి సరఫరా పంపు ఆపరేటర్ చేసేందుకు నెలకు 2000 చొప్పున గ్రామపంచాయతీ కార్యదర్శి స్పెషల్ ఆఫీసర్ గా ఉన్నప్పుడు పంచాయతీ నిధుల నుండి చెల్లిస్తామన్నారు. అధికారులు నేటికీ 12 నెలల వేతనాలు చెల్లించలేదన్నారు. గత రెండు సంవత్సరాలుగా సుజన కోట గ్రామంలో పంపు ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నానన్నారు. అప్పటి కార్యదర్శి మంజూరైన వెంటనే వేతనాలు చెల్లించేవారన్నారు. గత 12 నెలలుగా ప్రస్తుత కార్యదర్శి వేతనాలు చెల్లించలేదని, పాడేరు జిల్లా కలెక్టర్ కు పలుమార్లు ఫిర్యాదు చేసినా బకాయి పడ్డ వేతనాలు చెల్లించలేదన్నారు. అధికారులు స్పందించి బకాయిపడ్డ వేతనాలు చెల్లించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఈ విషయంపై సుజన కోట గ్రామపంచాయతీ సర్పంచ్ రమేష్‌కు వివరణ కోరగా గతంలో స్పెషల్ ఆఫీసర్లుగా ఉన్నప్పుడు పంచాయతీ సెక్రెటరీ పంపు ఆపరేటర్లను నియమించి దినసరి కూలి ఇచ్చేవారన్నారు. నిధులు లేని కారణంగా పంపు ఆపరేటర్లకు వేతనాలు చెల్లించలేమని, పంపు ఆపరేటర్లను స్వచ్ఛందంగా ఏర్పాటు చేసి గ్రామస్తులే నిర్వహించుకోవాలని తీర్మానించామన్నారు.

78 మందికి కు.ని శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కిలగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు 78 మందికి నిర్వహించినట్లు డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కిలగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధితో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల వారికి కుటుంబ నియంత్రణ చికిత్సలను చేపట్టామన్నారు. కుటుంబ నియంత్రణలో అత్యధికంగా పురుషులు 78 మందికి కుటుంబ .నియంత్రణ ఆపరేషన్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీకాంత్, శివప్రసాద్, ఈశ్వర్ సందీప్, నిఖిల్, బాబ్జి, ఎం శేఖర్ చైతన్య, శిరీష, నీలకంఠ ప్రతాప్, కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణదిగారి కే సుబ్రహ్మణ్యం, సిహెచ్ వేదవతి, హెల్త్ సూపర్వైజర్ కృష్ణవేణి పాల్గొన్నారు.


ఆపరేషన్లు చేసిన వైద్యులు

వాలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్
- 26, 27,28 తేదీల్లో చింతూరు ఐటిడిఏ వద్ద నిరసన దీక్షలు

ప్రజాశక్తి- చింతూరు : గ్రామ, వార్డు వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించడంతోపాటు వారికి నెలకు రూ.పది వేలు వేతనం ,ఇతర ప్రయోజనాలను కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు అల్లూరి, రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు అనుబంధ, అల్లూరి జిల్లా వాలంటీర్ల యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వాలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇందులో భాగంగానే చింతూరు, విఆర్ పురం,కూనవరం, ఎటపాక.మండలాల వాలంటీర్ల ఆధ్వర్యంలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వాలంటీర్లను కొనసాగించాలని కోరుతూ ఈనెల 26.27. 28. తేదీల్లో చింతూరు ఐటిడిఏ మూడు రోజుల దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు. నాలుగుమండలాల్లోని వాలంటీర్లంతా పాల్గొని, దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా వాలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొడియం జానీ, జిల్లా కమిటీ సభ్యులు కలుముల మహేష్‌కుమార్, సోడి దుర్గారావు, రాంరెడ్డి, రమేష్, స్రవంతి, పద్మావతి, శాంతి, రవి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేత పల్లపు వెంకట్

యానిమేటర్ల సమస్యలను పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వాణిశ్రీ
- రెండో రోజుకు చేరిన రిలే దీక్షలు


ఐటిడిఏ వద్ద రిలే దీక్షలశిబిరంలో మాట్లాడుతున్న వాణిశ్రీ

ప్రజాశక్తి -రంపచోడవరం : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వెలుగు యానిమేటర్ల (విఏఎ)లు రంపచోడవరం ఐటిడిఏ ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం రెండవ రోజుకు చేరుకున్నాయి. విఎల రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సందర్శించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడుతూ రంపచోడవరం, దేవీపట్నం,మండలాల వెలుగు యానిమేటర్లకు 16 మందికి 17 నెలలుగా, గంగవరం మండలంలో ఒకరికి 59 నెలలుగా వేతనాలు బకాయి ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని అనేకసారు జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, వెలుగు ఎపిడి, ఇతర ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా నేటికీ పరిష్కారం కాలేదన్నారు. వెలుగు విఎల సమస్యల పరిష్కారంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించటమే కాకుండా, దేవీపట్నం మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి వెళ్లిన ఎపిడికి తమ సమస్యను విన్నవించిన విఎల పట్ల నిర్లక్ష్యధోరణితో బకాయి వేతనాలు మరిచిపోవాలంటూ ఎపిడి నిర్లక్ష్యంతో చెప్పడం బాధాకరమన్నారు. వెలుగు యానిమేటర్ల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయన్నారు. తక్షణమే వెలుగు ఎపిడి, ఇతర అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని, టిఎ, డిఎలు ఇవ్వాలని, రాజకీయ నేతలు, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి అరగాటి, రామకృష్ణారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బంటుమల్లి.నరసింహ, మూడు మండలాల విఎలు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న ఇంటిగ్రేటెడ్ ఎగ్జిబిషన్


అతిథులకు ప్రాజెక్టు నమూనాలపై వివరిస్తున్న డిఎవి స్కూల్ విద్యార్థినులు

ప్రజాశక్తి -సీలేరు: స్థానిక డిఎవి పాఠశాలలో మెగా ఇంటిగ్రేటెడ్ ఎగ్జిబిషన్ పలువురిని ఆకట్టుకుంది. జాతీయ గణితశాస్త్ర దినోత్సవం, గణిత మేథావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను ఎపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇ శ్రీనివాస్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పూలామాలలు వేసి నివాళులర్పించారు. అనంతరంపాఠశాల విద్యార్థులు తయారుచేసిన సైన్సు, గణితశాస్త్రం, సాంఘిక శాస్త్రం, తెలుగు, హిందీ, ఇంగ్లీషు ఇతర సబ్జెక్టులకు సంబంధించి విభిన్న ఆకృతులతో తయారు చేసిన నమూనాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించగా, జెన్‌కో అధికారులు, విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు తిలకించి, ఎంతో బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, గణిత మేధావి రామానుజన్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. రామానుజన్ జయంతి ఆదివారం సెలవు దినం కావడంతో ముందు రోజే నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సోలార్ స్టార్ట్ విలేజ్, సేవ్ ఎర్త్, యాసిడ్ రైన్, చంద్రయాన్, జియో థర్మల్ ప్రాజెక్టు తదితర నమూనాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎపి జెన్‌కో ఎడిఇ (సివిల్) దుర్గాశ్రీనివాస్, జెన్‌కో అకౌంట్స్ ఆఫీసర్ ఇవివి సత్యనారాయణ, విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లో నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు.

పీసా కమిటీ ఉపాధ్యక్షునిగా సత్యనారాయణ

ప్రజాశక్తి- అడ్డతీగల: అడ్డతీగల మండలం దుచ్చర్తి గ్రామంలో నిర్వహించిన పీసా కమిటీ ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా ముర్ల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శిగా కానేం చంద్ర రావులను ఎన్నుకున్నారు. ఎన్నికల అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేశారు. డిప్యూటీ తహశీల్దార్ తేజస్విని అధ్యక్షతన పీసా చట్టంపై గిరిజనులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఎన్నికైనట్లు ధ్రువీకరణ స్వీకరిస్తున్న సత్యనారాయణ



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవిబాబు

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-అరకులోయ: వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే నియోజకవర్గం కేంద్రమైన అరకులోయలో శనివారం ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలిచి నేటికీ ఆరు నెలలు అవుతున్నా ఆయనకు ఇక్కడ క్యాంప్ కార్యాలయం లేదు. దీంతో ప్రజల సమస్యలు వినేందుకు వేదిక కరువైంది. ప్రత్యామ్నాయ లేక తన ఇంటి వద్దనే కార్యకలాపాలు నిర్వహించుకునేవారు. ఎట్టకేలకు పాడేరు ఐటిడిఏ రెంటల్ హౌసింగ్ కాలనీలో ఒక క్వార్టర్‌ను కేటాయించి పూర్తిస్థాయిలో మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకుని వచ్చారు. దీంతో ఆ క్యాంపు కార్యాలయమును ఎమ్మెల్యే మత్స్య లింగం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రవి బాబు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే కే.భాగ్యలక్ష్మి వైసీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి -ఆనందపురం : ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆనందపురం మండలం, గంభీరంలోని డ్రైవింగ్ లైసెన్స్ అండ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి జిల్లా రవాణా శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయం నుంచి అందిస్తున్న వివిధ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిటిసి ఆదినారాయణ, ఆర్‌టిఓ రామ్‌కుమార్, విశాఖ జిల్లా రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న రవాణా శాఖ అధికారులు

పరీక్షలను ఉత్సవంలా జరుపుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పరీక్షలను ఉత్సవంలా జరుపుకోవాలన్న ఉద్దేశంతో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు 'పరీక్ష పే చర్చ' పేరిట ప్రధాన మంత్రితో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించనున్నట్లు స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 14న ప్రారంభమైన ఈ కార్యక్రమం 2025 జనవరి 14 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి రాష్ట్రం నుంచి ఎంపికచేయబడిన ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడుతో పాటు కళా ఉత్సవంలో గెలుపొందిన విద్యార్థులకు ప్రధాన మంత్రితో నేరుగా మాట్లాడే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించిన ఒత్తిడి, కెరీర్ డెవలప్‌మెంట్, విద్యార్థుల భవిష్యత్, ఆశయాలు, విద్యా జీవితం గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నలు అడిగే అవకాశం ఉందని వివరించారు. ప్రశ్నలు నిడివి గరిష్ఠంగా 500 పదాల వరకు ఉండొచ్చని పేర్కొన్నారు. https :// Innova teindia 1.mygov.in / లింకు ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సంబంధిత వెబ్ సైట్‌లో నమోదై, మొబైల్ లేదా ఈ మెయిల్ ఒటిపి ద్వారా లాగిన్ అయ్యాక ప్రశ్నలను పంపించాలని సూచించారు. పిపిసి 2025 నోడల్ అధికారిగా మన రాష్ట్రానికి ఎపిఎస్‌ఇఆర్‌టి డైరెక్టర్ ఎంవి.కృష్ణారెడ్డిని నోడల్ అధికారిగా ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ ఏజెన్సీగా డైట్ వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. డైట్ అధ్యాపకులు జెజివి.నాగేశ్వరరావు, జి.రవి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎంఇఒలు, హెచ్‌ఎంలు ఈ కార్యక్రమం విజయవంతానికి కృషిచేయాలని కోరారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు



అరకులోయలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో శనివారం వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో పాటు, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే కే.భాగ్యలక్ష్మిలు వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసుకుని జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవి బాబు మాట్లాడుతూ, తాము ఎప్పుడు కూడా జగన్ వెంటే ఉంటామని స్పష్టంచేశారు. జగన్ ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నదే తమ లక్ష్యం అన్నారు. దేశ చరిత్రలో ఎవరు చేయనటువంటి అభివృద్ధిని జగన్మోహన్ రెడ్డి చేశారన్నారు. ప్రజానీకానికి నాణ్యమైన విద్య, వైద్యం అందించి విప్లవాత్మకమైన మార్పు తీసుకుని వచ్చారన్నారు. అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు గ్రామాల్లోని ప్రతి ఒక్కరికి అందిందని అందుకే ఆయన ప్రజల గుండెల్లో నేటికీ ఉండిపోయారన్నారు. మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి వాటిని విస్మరించి అరాచక పాలన సాగిస్తుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి వైసీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు.

విశాఖ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పల్లి సుభద్ర మాట్లాడుతూ, సచివాలయాల ద్వారా గ్రామ స్వరాజ్యం జగన్ తీసుకొచ్చి పాలన అందుబాటులోకి తెచ్చారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల వైసిపి నేతలు, జడ్పిటిసి, ఎంపీపీలు, ఎంపిటిసిలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకను స్థానికగాంధీ బొమ్మ సెంటర్‌లో వైసిపి మండల కన్వీనర్, సొసైటీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసారు. పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు నిర్వహించిన వేడుకలో పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేశ్వరరాజు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, లబ్బర్తి సర్పంచ్ ఎం.సత్యవతి, ఎంపిటిసి కనిగిరి గంగాదుర్గ, పార్టీ నాయకులు ఎన్ కుశరాజు, కనిగిరి దుర్గాప్రసాద్, కనిగిరి వీరబాబు, సిహెచ్.శాంతకుమారి, ఎం సురేష్ ,కె.పరంజ్యోతిరాజు, ఎం.ముసలయ్య, ఎ సత్తిబాబు, వి.లక్ష్మి, ఇ.రాణి, మహేశ్వరి పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ సెంటర్, దుర్గాదేవి షెడ్‌లో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ దుర్గ, కార్యకర్తలు గణేష్ వెంకట్రావు బుజ్జి అభిమానులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో రోగులకు రొట్టెలు,పండ్లు పంపిణీ చేస్తున్న వైసిపి నేతలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

500 మందికి రగ్గులు, చీరల పంపిణీ



రగ్గులు, చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, తదితరులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏసుక్రీస్తు బోధనలను ఆదర్శంగా తీసుకుని మనసులంతా కష్టాల్లో ఉన్న సాటి వారికి సహాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోని విఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకకు పాస్టర్లు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రార్ధనలు, గీతాలాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రేమ, కరుణ, త్యాగానికి ప్రతీకగా జీసస్ అనుసరించిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని కోరారు. స్థానిక ప్రభువైన ఏసుక్రీస్తు ప్రార్ధన మందిరం పాస్టర్ తిమోతి అధ్యక్షతన జరిగిన వేడుకకు కోనసీమ జిల్లా, రామచంద్రపురం నుంచి జాయ్ మినిస్ట్రీస్ ఆఫ్ ద గాస్పల్ కో-ఆర్డినేటర్ గాసన్న జాన్ వెస్లీ, యుసివైఎ ఫౌండర్ చీఫ్ జాన్ రీమలి హాజరై క్రిస్మస్ సందేశాలను అందించి క్రిస్మస్ కేకును కట్ చేశారు. అనంతరం గ్రాండ్ క్రిస్మస్ కు విచ్చేసిన పాస్టర్లలకు రగ్గులు, స్త్రీలకు చీరలను పంపిణీ చేసి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు, పలువురు పాస్టర్లు, యుసివైఎ సభ్యులు కె.సత్యారావు, ఆర్.ప్రవీణ్, డి.రవికుమార్, ఒ.జ్ఞానప్రకాష్, నియోజకవర్గంలోని క్రైస్తవులు, టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ముగింపు వేడుకల్లో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవాలని విద్యార్థులకు అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్ర వారం ప్రారంభమైన 'జ్ఞాన్ 2 కె 24 టెక్ ఫెస్ట్' వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, యువతే ఈ దేశానికి సంపద అని నొక్కి చెప్పారు. పరిశోధనలపై మరింతగా దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. గౌరవ అతిథి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.రాంజీ మాట్లాడుతూ, విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న మేధో సంపత్తిని వెలికి తీసేందుకు ఈ తరహా విద్యా , వైజ్ఞానిక ప్రదర్శనలు దోహద పడతాయన్నారు. జెఎన్‌టియు డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ కె.బాబులు మాట్లాడుతూ, నైతిక విలువలు, అడ్వాన్స్ టెక్నాలజీ పెంపొందించుకోవాలన్నారు. డబ్ల్యూఎన్ఎస్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ఎల్.నారాయణ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. తిరుపతి శ్రీ సిటీ సిఎస్ఇ ప్రొఫెసర్ డాక్టర్ డి.చంద్రమోహన్ మాట్లాడుతూ, ప్రతి అంశాన్నీ సానుకూల దృక్పథంతో చూడాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన 340 మంది విద్యార్థులకు సుమారు రూ.2 లక్షల విలువైన బహుమతులు, ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, డీన్ డాక్టర్ గండి సత్యనారాయణ, అవంతి పాలిటెక్నిక్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌బిఐ సర్టిఫికెట్లు అందుకున్న ఆదర్శ్ విద్యార్థులు

ఆదర్శ్ విద్యార్థులకు ఆర్‌బిఐ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఆర్‌బిఐ క్విజ్ పూర్తిచేసిన 60 మంది విద్యార్థులకు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.థియోఫిలస్ ఆధ్వర్యాన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ్ డిగ్రీ కాలేజీ కెరియర్ గైడెన్స్ సెల్ సౌజన్యంతో విద్యార్థులకు మంచి నైపుణ్య అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. బలమైన స్కిల్స్ ఇచ్చే ఎడ్యుకేషనల్ సంస్థ ఆదర్శ్ డిగ్రీ కాలేజీ అని తెలిపారు. ప్రతి విద్యార్థీ డిగ్రీతో పాటు స్కిల్ సర్టిఫికెట్ సంపాదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ.ఫ్లోరా, వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, కెరియర్ గైడెన్స్ సెల్ ఆఫీసర్ కెవి.నాగమణి, ఎస్.కామేశ్వరి, కె.బ్యూలమెర్సీ, పి.సతీష్, కె.లక్ష్మణ, పి.లీలావతి, బి.రాధారాణి, కెఎ.శ్రీను పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ విజనరీ ఇన్‌సైట్స్‌కు బహుమతి

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్ నెలవారీ న్యూస్ లెటర్ (ఆంగ్లం) 'విజనరి ఇన్ సైట్స్'కు రెండో బహుమతి లభించినట్లు సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ తెలిపారు. చత్తీస్‌ఘడ్‌లో జరిగిన ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో అవార్డును ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విజయశర్మ ద్వారా శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు అందుకున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ సత్యనారాయణ

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - దేవిపట్నం : భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను గిరిజన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె.సత్యనారాయణ సూచించారు. మండలంలోని ఇందుకూరిపేట గ్రామ సచివాలయం వద్ద తహసిల్దార్ కె.సత్యనారాయణ, సర్పంచ్ కారం కృష్ణబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీలో అమలులో ఉన్న భూచట్టాలు, గిరిజనులు, గిరిజనేతర భూములకు గల వ్యత్యాసం వివరించారు. 1/ 70 చట్టం కోసం తమ దగ్గర వందేళ్ల క్రితం చేసిన రికార్డు మాత్రమే ఉందని, ఆ తర్వాత సర్వే జరగలేదన్నారు. ఏజెన్సీలో గిరిజనుల మధ్య భూక్రయవిక్రయాల సమస్యలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ద్వారా కె ఫారం ఎల్ ఫారం ద్వారా సమస్య పరిష్కరించుకోవచ్చని, దానికి రెవెన్యూ గ్రామసభలు దోహదపడతాయన్నారు. తగిన ఆధారాలు, రికార్డులు, అడంగల్ సక్రమంగాఉంటే భూ సరిహద్దులు,పేర్లు మార్పులు, పాస్‌బుక్ తయారీ, ఇతర సమస్యలను రెవెన్యూసదస్సులో సత్వరమే పరిష్కరిస్తామని వెల్లడించారు.

అమిత్ షా వ్యాఖ్యలు హేయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంటులో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం విదసం ఆధ్వర్యంలో దళిత సంఘాలు ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టాయి. అమిత్ షా దిష్టిబొమ్మతో అంబేద్కర్ విగ్రహం చుట్టూ శవయాత్ర నిర్వహించాయి. కార్యక్రమంలో విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, రాజేంద్రప్రసాద్ (భీమ్ సేన), గొలమాల అప్పారావు (దళిత సేన), దుర్గారావు (బిఎస్ఐ), వై.నూకరాజు (భానాస), మాటూరి శ్రీనివాసరావు (ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ ఫెడరేషన్), అంబేద్కర్ (యుటిఎఫ్) పాల్గొన్నారు.

నావికాదళ విన్యాసాల నిర్వహణలో సమన్వయం కీలకం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : వచ్చే నెల 4న ఆర్కే బీచ్ పరిధిలో జరుగనున్న నావికాదళ విన్యాసాల నిర్వహణలో అందరూ సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. ఇండియన్ నేవీ, జివిఎంసి, విఎంఆర్‌డిఎ కమిషనర్లతో కలిసి శనివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. విశ్వప్రియ ఫంక్షన్ హాలు, ఆర్కే బీచ్ పరిసర ప్రాంతాల్లో పలు చోట్ల తిరిగిన ఆయన అక్కడ పరిస్థితులపై సమీక్షించారు. విన్యాసాలకు సంబంధించి అన్ని రకాల క్రతువుల గురించి నేవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జివిఎంసి, విఎంఆర్‌డిఎ కమిషనర్లు పి.సంపత్ కుమార్, కెఎస్.విశ్వనాథన్, నేవీ అధికారులు ఉన్నారు.

పాలసముద్రం చిత్రలేఖన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్, నార్కోటిక్స్ (నాసిన్) ఆధ్వర్యంలో సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ సహకారంతో నిర్వహించిన 'పాలసముద్రం జాతీయ చిత్రలేఖన శిబిరం' విజయవంతంగా ముగిసింది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం సమకాలీన భారతీయ కళకు చెందిన 25 మంది ప్రసిద్ధ కళాకారులను ఒకచోట చేర్చింది. శిబిరంలో పాల్గొన్న సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్, ఆర్కిటెక్చర్, డిజైన్ పూర్వ విద్యార్థులు, సుందరీకరణలో భాగంగా ప్రత్యేకమైన, అర్ధవంతమైన కళాకృతులను ఆవిష్కరించారని నాసిన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ గైగోంగ్డిన్ పన్మేయి తెలిపారు.

ఎరుపెక్కిన నర్సీపట్నం

ఘనంగా సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభ ప్రారంభం
పట్టణంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ - ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
ఆలోచింపజేసిన నాయకుల ప్రసంగాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నర్సీపట్నం టౌన్ విలేకరి

నర్సీపట్నం శనివారం ఎరుపెక్కింది. ఎక్కడ చూసినా ఎర్రజెండాల రెపరెపలే.. కామ్రేడ్ల ఉద్యమ నినాదాలే. సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభ శనివారం నర్సీపట్నం వేదికగా ఘనంగా ప్రారంభమవడంతో అంతటా ఎర్రజెండా గురించే ప్రజలు మాట్లాడుకోవడం కనిపించింది. జిల్లా నలుమూలల నుంచి సిపిఎం కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టగా ప్రజలు, కార్మికులు వారితో కలిసి నడిచారు. అనంతరం జరిగిన బహిరంగ సభ అందరినీ ఆలోచింపజేసింది. నాయకుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

సిపిఎం జిల్లా మహాసభ నేపథ్యంలో తొలుత స్థానిక ఎల్ఐసి కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమైంది. మెయిన్ రోడ్డు, కృష్ణాబజార్ మీదుగా పట్టణమంతా సాగుతూ అబిద్ సెంటర్‌కు అది చేరుకుంది. ర్యాలీలో యువత ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డప్పుల దరువులు, కోలాటం, థింసా నృత్యాలతో ఈ ర్యాలీ ఉత్తేజంగా సాగింది. ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను పాలకులు విడనాడాలంటూ ర్యాలీలో పాల్గొన్న వారంతా పెద్దపెట్టున నినదించారు. అల్లూరి సీతారామరాజు వేషధారణలో ఓ వ్యక్తి విల్లు ఎక్కి పెట్టి నడుస్తుంటే నాటి మన్యం పోరాట స్మృతులు కళ్లముందుకదలాడాయి. ఆ వ్యక్తితో ఫొటోలు దిగేందుకు పలువురు పోటీపడ్డారు. విద్యుత్ ఛార్జీల పెరుగుదలను ఖండిస్తూ విద్యుత్ స్తంభాన్ని భుజంపై మోస్తూ భారాల తీవ్రతను కళ్లకు కట్టినట్టు ఓ కామ్రేడ్ తెలియజేశాడు. ర్యాలీకి ముందు రెడ్‌షర్ట్ వాలంటీర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కళాకారులతో కలిసి చిందేస్తూ ఉత్తేజం నింపారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు, వేదికపై సురేంద్ర, లోకనాథం

ఉక్కుపై కుట్రలు తీవ్రం : వై.వెంకటేశ్వరరావు

అబిద్ సెంటర్‌లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఎందుకు కేటాయించడంలేదని ప్రశ్నించారు. ప్లాంట్ ప్రైవేటీకరణకు రోజురోజుకూ కుట్రలు పెరుగుతున్నాయన్నారు. నక్కపల్లి ప్రాంతంలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కారుచౌకగా భూములు కట్టబెట్టి రాయితీలు కల్పించడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి తప్ప ప్రభుత్వరంగ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలన్న ఆలోచనలో లేవన్నారు. ఉక్కుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించాలని కోరారు.

నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలి : కిల్లో సురేంద్ర



బహిరంగ సభకు తరలొచ్చిన సిపిఎం కార్యకర్తలు, ప్రజలు

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలన్నారు. కిలో జీడి పిక్కలను 200 రూపాయల చొప్పున రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అటవీ ప్రాంత సహజ వనరులు ప్రయివేటు వ్యక్తుల పరం కాకుండా ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలన్నారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి గ్యారంటీ కోసం పోరాటాలు నిర్వహించాలన్నారు.

మూతపడ్డ సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలి : కె.లోకనాథం

పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ జిల్లాలో మూతపడ్డ తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తిచేసినపుడే సాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యను పట్టించుకోవడంలేదని అన్నారు. కూటమి ప్రభుత్వ వాగ్ధానాల అమలుకు చేపట్టబోయే పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు.

పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి మాట్లాడుతూ మోడీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, జి.కోటేశ్వరరావు మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్.గౌరి, సూర్యప్రభ, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి

అనంతరం ప్రతినిధుల సభ ఎ.బాలకృష్ణ నగర్, సత్తిబాబు ప్రాంగణం, మళ్ల సత్యనారాయణ వేదికగా ప్రారంభమైంది. పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, అమర వీరుల చిత్రపటాలకు వై.వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ప్రతినిధుల సభకు అధ్యక్షవర్గంగా డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, డిడి.వరలక్ష్మి వ్యవహరించారు. రాజకీయ నిర్మాణ నివేదికను పార్టీ జిల్లా కార్యదర్శి కె లోకనాథం ప్రవేశపెట్టారు. అనంతరం చర్చలు సాగాయి.

సిపిఐ అపూర్వ స్వాగతం

సిపిఎం ర్యాలీకి పట్టణంలో సిపిఐ నాయకులు పూలు జల్లుతూ అపూర్వ స్వాగతం పలికారు. మార్క్సిజం, వామపక్షాల ఐక్యత వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రాము, జి.గురుబాబు, శివలంక కొండలరావు, జి.రాధాకృష్ణ, నల్లబెల్లి శ్రీరామమూర్తి, చౌదరి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహనా శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు

గ్యాస్ట్రో ఇంటెస్టినల్ కేన్సర్లపై అవగాహన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శనివారం నోవాటెల్ హోటల్‌లో 4వ ఐఎస్ఎంపిఒ (ఇండియన్ సొసైటీ ఆఫ్ మెడికల్ అండ్ పీడియాట్రిక్ ఆంకాలజీ) ప్రీసెప్టర్షిప్ కోర్సు నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 100 మంది ప్రతినిధులు పాల్గొనగా గ్యాస్ట్రో ఇంటెస్టినల్ కేన్సర్ అంశాల్లో ప్రావీణ్యం కలిగిన 30 మంది ప్రముఖ నేషనల్ ఫ్యాకల్టీ సభ్యులు తమ విలువైన పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమం గ్యాస్ట్రో ఇంటెస్టినల్ కేన్సర్ల నిర్ధారణ, చికిత్స, నిర్వహణలో తాజా పురోగతులపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా జరిగింది. మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వైద్య రంగంలో ఉన్నత ప్రమాణాలు, విద్యార్థుల శిక్షణలో అంకితభావంతో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని వక్తలు కొనియాడారు.

కనీస వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో సఫాయి కర్మచారి (పారిశుధ్య కార్మికులు)లకు కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం చెల్లించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి.వావా అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను అధ్యయనం చేసి వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలన్నారు. సఫాయి కర్మచారిలకు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని, వారికి బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బ్యాంకు రుణాలకు ఎటువంటి ష్యూరిటీలూ అవసరం లేదని అన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో, సేవా రంగంలో అనేక అవకాశాలను కల్పించవచ్చని చెప్పారు. జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు. వారి కుటుంబ సభ్యులకు వివిధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సఫారీ కర్మచారి ప్రమాదవశాత్తు మరణించినప్పుడు తక్షణం కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. కార్మికులకు అవసరమగు దుస్తులు, బూట్లు, చేతి గ్లోవ్స్ తదితర సామగ్రిని అందజేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సఫాయి కర్మచారిలకు అందజేస్తున్న ప్రభుత్వ పథకాలు, వారి సంక్షేమానికి అందజేస్తున్న ఇతర సదుపాయాలను వివరించారు.

40 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- మోతుగూడెం : అల్లూరిజిల్లా, వై రామవరం మండలం, డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో 40 కిలోల గంజాయి పట్టుకున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు, వాహన తనిఖీలు చేస్తుండగా, తమిళనాడుకు చెందిన ప్రకాష్ జ్యోతిపాస్, రాజమహేంద్రవరానికి చెందిన చల్లా రవీంద్రప్రసాద్ ఒడిశా రాష్ట్రం అల్లూరికోట గ్రామంలో 40 కేజీలు గంజాయిని కొనుగోలుచేసి, కారులో బెంగళూరుకు తరలిస్తుండగా, డొంకరాయి చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడిందని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. చింతూరు, ఎటపాక సిఐల ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించి, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శివకుమార్ వెల్లడించారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు కోరారు. శనివారం రైల్వే స్టేషన్‌లో సంబంధిత అధికారులతో పలు అభివృద్ధి పనుల కోసం ఆయన చర్చించారు.